క్లుప్తంగా

ఆధార్ లింకుతో భూధార్ కార్డు


అద్దంకి: కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అద్దంకి: రైతులు తమ ఆధార్‌తో ఫోన్ నంబరు లింకు అయితేనే భూధార్ కార్డు పొందడదనికి వీలు అవుతుందని ఎపీడీఓ సింగయ్య అన్నారు. సోమవారం మండలంలోని వెంకటాపురంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ భూదార్ రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు లింకు కావాల్సి ఉంటుందన్నారు. అటువంటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ఆధార్ కేంద్రాలతో ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు లింకు చేసే విధంగా కేంద్రాలు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. అవసరమైన వారు ఆయా కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన


వెరిఫికేషన్ చేస్తున్న ఏపీఓ

అద్దంకి: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఏపీవో గాయత్రి పరిశీలించారు. దానిలో భాగంగా ఆమె మండలంలోని తిమ్మాయపాలెం, రామాయపాలెం గ్రామాల్లో ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. మస్టర్ వెరిఫికేషన్ చేశారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరికీ కూలీ పడే విధంగా పనులు చేయాలని అలాగే వారి చేత మేట్లు పనులు చేయించాలని సూచించారు.

అద్దంకి ఎంఈఓకు అదనపు బాధ్యతలు

అద్దంకి రూరల్: అద్దంకి మండల విద్యాశాఖాధికారి 1 గా పనిచేస్తున్న డి. గంగాధరరావు.. చీరాల డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిగా మంగళవారం అదనపు బాధ్యతలు చేపట్టినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విద్యాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.


అద్దంకి శివారు ప్రాంతాల్లో పోలీసు తనిఖీలు

అద్దంకి రూరల్: అద్దంకి ఎస్సై ఖాదర్‌బాసా ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ శివారు ప్రాంతంలోని సంచార జాతి డేరా గృహాల్లో సోదాలు చేపట్టారు. గంజాయి సరఫరా అవుతుందన్న సమాచారంతో గుడారాల్లో నివశించేవారి నుంచి సమాచారం సేకరించారు.

ఇరువర్గాలకు గాయాలు

చీరాల: పరస్పర దాడుల నేపథ్యంలో ఇరువర్గాలకు గాయాలైన సంఘటన మంగళవారం స్థానిక వైకుంఠపురంలో చోటుచేసుకుంది. అంజలి అనే మహిళకు నాగండ్ల వీరబ్రహ్మంకు గతంలో ఇంటి స్థలం సంబంధించి కోర్టులో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఇరువురి మధ్య ఘర్షణ జరిగి దాడులు చేసుకున్నారు. అంజలికి బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అవుటుపోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

వేసవి తరుణం.. నీటికి గ్రహణం


చీరాల నగర్ గ్రామంలో పనిచేయని షాలో బోరు

- గ్రామాల్లో మూలన పడిన చేతిపంపులు
- దాహార్తితో జనం విలవిల్లాడక తప్పదా?
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

చీరాల టౌన్: త్వరలో వేసవి ఎండలు స్వాగతం పలకనున్నాయి. అంటే నీటి ఎద్దడి పొంచి ఉంది. ఇలాంటి సమయంలో ప్రజల దాహార్తి తీర్చాల్సిన అధికారులు ఇంకా మేల్కొలేదు. పెద్ద చేతిపంపులు (షాలోబోర్లు) మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల్లో 150 షాలో బోర్లు ఏర్పాటు చేయగా వాటిలో 60 వరకు మూలన పడ్డాయి. ప్రధానంగా చీరాల మండలానికి దూరంగా ఉన్న తీర ప్రాంత గ్రామాలైన దేవినూతల, కావూరివారిపాలెం, పిట్టువారిపాలెం, బుర్లవారిపాలెం, గవినివారిపాలెం, పచ్చమొగిలి, విజయలక్ష్మీపురం, కీర్తివారిపాలెం, లింగాపురం, నక్కలవారిపాలెం, తోటవారిపాలెం, వాడరేవు గ్రామ పంచాయతీలు, చీరాల పట్టణానికి చేరువగా ఉన్న రామకృష్ణాపురం, సాల్మన్‌సెంటర్, చీరాల నగర్, కొత్తపాలెం తదితర గ్రామాల్లోని చేతి పంపుల నుంచి మంచి నీరు రావడం కరువైంది. వేసవిలో ప్రజల దాహార్తికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వలనే సమస్య మరింత జఠిలంగా మారనుంది. గ్రామ పంచాయతీల్లో తాగు నీటి సమస్యలు లేకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన చేతిపంపులు మరమ్మతులు చేయల్సి ఉన్నా.. ప్రత్యేకాధికారులు గానీ, మండల పరిషత్ అధికారులు గానీ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో తాగునీటి కోసం ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిధులున్నా నిష్ప్రయోజనం అన్న చందంగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు తమను ఇబ్బందులకు గురిచేస్తుందని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో బోర్లు, మరమ్మతులను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ఇకనైనా అధికారులు స్పందించి మూలనచేరిన చేతిపంపులను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలకృష్ణ ఏమంటున్నారంటే..

ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలకృష్ణను వివరణ కోరగా మండలంలోని గ్రామాల్లో మరమ్మతుల్లో ఉన్న షాలో బోర్లను రిపేరు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీకి ఉన్న ఈ నిధులతో మరమ్మతులకు గురైన పంపులను రిపేరు చేసేందుకు అవకాశం కూడా ఉందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రిపేర్లలో ఉన్న చేతి పంపులు, షాలోబోర్లను కొద్ది రోజుల్లో బాగుచేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.


బుర్లవారిపాలెం రోడ్డులో ఆరు నెలల నుంచి మరమ్మతులకు నోచుకోని షాలో బోరు

గంజాయి రవాణాకు పాల్పడితే కేసులు


ఇంకొల్లులో మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్

ఇంకొల్లు(చినగంజాం): గంజాయి సంబంధిత చర్యలకు పాల్పడితే అలంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని చీరాల సబ్ డివిజన్ పోలీస్ అధికారి మొహమ్మద్ మొయిన్ అన్నారు. ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను, కేసులకు సంబంధించిన ఫైళ్ళను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసులు పురోగతికి సంబంధించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. గతంలో గంజాయి కేసుల్లోని ముద్దాయిల ఇళ్ళను ఆకస్మికంగా తనిఖీ చేసి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని హెచ్చరించారు. అదే విధంగా పలు గ్రామాలను సందర్శించి గంజాయి పైన ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గంజాయికి సంబంధించి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, గంజాయి అమ్మినా, కొనినా, గంజాయి చెట్లను పెంచినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఇంకొల్లు ఎస్ఐ జి. సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి అమ్మితే కఠిన చర్యలు

చీరాల: గంజాయి అమ్మకాలు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. మంగళవారం చీరాల మండలం ఈపూరుపాలెంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈపురుపాలెం ఎస్సై అంబటి చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మేరిమ్మ

యద్దనపూడి: రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్. మేరిమ్మ అన్నారు. మండలంలోని చింతావారిపాలెం, వింజనంపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వలన ప్రభుత్వ పథకాలు అన్నింటినీ పొందవచ్చు అన్నారు. 11 అంకెలు కలిగిన విశిష్ట సంఖ్యను పొందడం ద్వారానే రైతులుకు పథకాలు చేరవేస్తామని అన్నారు. వీఏఏలు సుదర్శన్, లీలా సత్య, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు చేయూత

చినగంజాం: దివ్యాంగులైన చిన్నారులకు ప్రభుత్వం అన్ని విధాలా చేయూత నిస్తుందని చినగంజాం, సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ పి. సాయిశ్రీ చరణ్, బి. నాగేంద్ర అన్నారు. మంగళవారం రాజుబంగారుపాలెం, చింతగుంపలలో దివ్యాంగుల చిన్నారుల అవగాహన సమావేశాలను నిర్వహించారు. ఇందులో భాగంగా మూడు అంగన్‌వాడీ సెంటర్‌లు, రెండు ప్రాథమిక పాఠశాలలు సందర్శించి మొత్తం 5 గురు దివ్యాంగులైన చిన్నారులను గుర్తించారు. మండల లీగల్ సెల్ అడ్వకేట్ ఏ. రామకృష్ణారెడ్డి, మండల పారా లీగల్ వలంటీర్ ఎంవీ రామారావు, పీ పార్థసారధి, ఏపీఎం సుబ్బారావు, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశలు, 104 డీఈఓ రాఘవ, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్‌కు ఇన్వర్టర్లు అందజేత



పాఠశాలకు అందించిన ఇన్వర్టర్, బ్యాటరీలు

వేటపాలెం: అక్కాయపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఐటీసీ అనుబంధ సంస్థ ఫినిష్ సొసైటీ చీరాల బ్రాంచి ఆర్థిక సహకారంతో మంగళవారం ఇన్వర్టర్లు, బ్యాటరీలను సొసైటీ ప్రాజెక్టు ఫీల్డ్ వర్కర్ పి.రాజు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం భవనం భద్రిరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ఆర్థిక సహకారంతో పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో కూడా విద్యుత్ లేని సమయంలో ప్రభుత్వం వారు ఇచ్చిన ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ నిరుపయోగం కాకుండా చూడాల్సిన ఆవశ్యకతను గుర్తించి, ఈ సమస్యను తీర్చాలనే ఉద్దేశంతో ఫినిష్ సొసైటీ వారిని కోరగా ఏర్పాటు చేశారన్నారు. ప్రాజెక్టు ఫీల్డ్ వర్కర్ పి.రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసులరెడ్డి, అనూరాధ, అంజమ్మ, బాలసుబ్రహ్మణ్యం, ఖమరున్నీసాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాషా దినోత్సవం


మాట్లాడుతున్న హెచ్ఎం

వేటపాలెం: రాష్ట్ర సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు నాలుగు రోజులు పాటు భాషా దినోత్సవ ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మంగళవారం వేటపాలెం మండలం పందిళ్ళపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్ఎం ఎం.శేఖరరావు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు నుంచి 9వ తరగతి విద్యార్థులచే కథలు చదవడం, రాయడం, ఆంగ్ల భాష ప్రాధాన్యత గురించి మాట్లాడించడం, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేయించడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు వీఎల్ఎన్ నరసింహారావు, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, మనోవికాసం నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్టూరు స్టేషన్లో మరోసారి రైతుల ఫిర్యాదు


సీఐ శేషగిరిరావుకు ఫిర్యాదు చేస్తున్న కోలలపూడి గ్రామ రైతులు

మార్టూరు: మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన 15 మంది రైతులు మంగళవారం మార్టూరు సీఐ మద్దినేని శేషగిరిరావుకు తమ గ్రామంలో జరుగుతున్న వరుస చోరీలపై మరోసారి ఫిర్యాదు చేశారు. గత కొన్ని నెలలుగా కోలలపూడి గ్రామంలో వ్యవసాయ భూములలోని మోటార్లు, సోలార్ ప్లేట్లు, వైర్లు చోరీకి గురవుతున్న సంగతి తెలిసిందే. ఈ విషయమై రైతులు పోలీస్ స్టేషన్లో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. ఇటీవల తాతా సాంబయ్య అనే రైతు భూమిలోని 25 వేల రూపాయల మోటారుతో పాటు బలగాని రామాంజనేయులు పొలంలోని లక్ష రూపాయల విలువైన సోలార్ సెట్లు చోరీకి గురయ్యాయి. చాలామంది రైతుల భూముల్లోని వైర్లను కత్తిరించిన దొంగలు వాటికి అక్కడి పొలాల్లోనే మంటలు వేసి కరిగించి అందులోని రాగి తీగ చోరీ చేశారు. ఈ క్రమంలో దొంగల ఆటలు కట్టించి తమను ఆదుకోవాలని రైతులు ఫిర్యాదు చేశారు. సీఐ మాట్లాడుతూ మీ భూములు ఎన్నింటికి తాము కాపలా కాయగలమని మీ వస్తువులు.. మీరే జాగ్రత్తగా కాపాడుకోవాలని, రైతులు జట్లుగా ఏర్పడి రాత్రిళ్లు కాపలా కాసుకోవాలని సలహా ఇచ్చినట్లు రైతులు వాపోయారు. కార్యక్రమంలో రైతులు బలగాని రామాంజనేయులు, తాతా సాంబయ్య, కీర్తి రమణయ్య, సూరగాని కొండయ్య, యార్లగడ్డ సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ మమ

బల్లికురవ: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి మంగళవారం బల్లికురవలో జరిగిన బహిరంగ ప్రజావేదిక మమ అని పించింది. 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 21 గ్రామపంచాయతీలో 1036 పనులకు రూ.13.51 కోట్లు కేటాయించారు. నెల రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల వారీగా పనుల తనిఖీలు మమగా తుతూ మంత్రంగానే ముగించారు. సంవత్సరం నుంచి మండలంలోని ఏపీవో పోస్టు ఖాళీగానే ఉంది. ఇన్ చార్జి ఏపీవో కార్యాలయానికి పరిమితం అవుతున్నారు. డ్వామా బాపట్ల జిల్లా పీడీ ఏబీవో శోభన్, ఏపీడీ కోటానాయక్ ఎంఈడీవో కుసుమకుమారి, తహసీల్దార్ రవినాయక్ బృందాలకు సంబంధించిన టీమ్ లీడర్ చిరంజీవి పాల్గొన్నారు. ప్రతిగ్రామ పంచాయతీలో జరిగిన పనుల్లో లోపాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఆ సందర్భంలో పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో జరగాల్సిన ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడినా.. ప్రమాణాలు పాటించక పోయనా సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేస్తామన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావేదిక రెండు గంటల ఆలస్యంగా ప్రారంభమై లోపాలు ఉండటం వల్ల రాత్రి 8.30 వరకు సాగింది.

బాల్యవివాహాలు నిర్మూలించాలి

బల్లికురవ: బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సంతమాగులూరు సీడీపీఓ డి. సుధ అన్నారు. మంగళవారం బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో బాలల హక్కులు, బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలు, చైల్డ్ హెల్ప్ లైన్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశాల మేరకు భారీ హోర్డింగ్‌ల ఏర్పాటుతో ఆవిష్కరించారు. బాలికలను రక్షించుకోవటంతో పాటు హక్కులను కాపాడుకోవాలన్నారు. 14 సంవత్సరాల్లోపు బాలబాలికలు పాఠశాలలోనే ఉండాలని పనుల్లో పెట్టుకుని బాల కార్మికులగా మరణిస్తే యజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలికల చదువు ఆ ఇంటికే వెలుగునిస్తుందని జీవితంలో స్థిరపడేవరకు వివాహాలు చెయ్యవద్దని సీడీపీఓ తల్లిదండ్రులకు వివరించారు.

భూముల రీసర్వే వేగవంతం చేయండి

కారంచేడు: మండలంలోని ఆదిపూడిలో రెండో విడద భూముల రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని చీరాల ఆర్డీఓ కె. చంద్రశేఖరనాయుడు ఆదేశించారు. మంగళవారం ఆదిపూడిలో జరుగుతున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామ రెవెన్యూ పరిధిలో ఎన్ని ఎకరాలు రీ సర్వేకు ఉపక్రమించారో ఆయన తహసీల్దారు జి. నాగరాజును అడిగి తెలుసుకున్నారు. రీసర్వేకు అడ్డంకులు రాకుండా ఉండేందుకు సంబంధిత రైతులు తమ వ్యవసాయ భూములకు చెందిన పత్రాలు, సిబ్బందికి అందించాలని ఆయన కోరారు. తహసీల్దారు జి. నాగరాజు, డీటీ అనిత, డివిజన్ సర్వేయర్ మునలయ్య, మండల సర్వేయర్ సత్యన్నారాయణ, వీఆర్ఓ మత్తయ్య, కార్యదర్శి కృష్ణ, రెవెన్యూ, పంచాయతీ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చీరాల రూరల్: గూడూరు మెనూ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చీరాల–వేటపాలెం రైల్వే స్టేషన్‌ల మధ్య చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. వేటపాలెం మండలం ఆమోదగిరిపట్నం దేశాయిపేటకు చెందిన పాలులూరి పృధ్వీరాజ్ (27) కాలకృత్యాలు తీర్చుకునేందుకు రైలు పట్టాల పైకి వెళ్లాడు. రైలు బండిని గమనించకుండా అతడు రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో విజయవాడ నుంచి గూడూరు వైపు వెళ్లే గూడూరు మెను ఎక్స్‌ప్రెస్ రైలు పృధ్వీ రాజ్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర రక్త గాయాలపాలైన అతడు సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

అద్దంకి రూరల్: ప్రతి రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం ధర్మవరం, శంఖవరప్పాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆధార్ పట్టా పాస్ పుస్తకాలు, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్‌తో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి విశిష్ట సంఖ్యకు ముడిపడి ఉందని తెలిపారు. కొందరు రైతులు ఇప్పుడు కూడా వరి, మొక్కజొన్న సాగు చేస్తున్నారని ఇప్పుడు సాగు చేయరాదని, దిగబడులు తగ్గిపోతాయని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రోజీ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకోండి

ఇంకొల్లు(చినగంజాం): రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ కోసం రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి పి. వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని కొనికి, భీమవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకొని 11 అంకెల విశిష్ట సంఖ్య కోసం రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పశుసంవర్థక శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే చర్యలు

స్వర్ణ (కారంచేడు): రైతులను మోసం చేస్తూ లబ్ధి పొందాలని చూసే దళారులు ఎంతటివారైనా సహించేది లేదని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ కె. నాగేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని స్వర్ణ గ్రామంలో పలు దుకాణాలు, ధాన్యం కొనుగోలు పాయింట్లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం అమ్మకాలు ప్రస్తుతం ముమ్మరంగా సాగుతుండగా దళారులు రైతులను మోసం చేస్తున్నారన్నారు. కారంచేడు మండలంలోని కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ ప్రాంతాల్లో దళారులు, మిల్లర్లు వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఒక్కో ధాన్యం బస్తా 75 కేజీల చొప్పున తూకం వేయాల్సి ఉండగా తూకంలో తేడాలతో ఒక్కో బస్తాకు 76 కేజీల చొప్పున సేకరిస్తున్నారన్నారు. తనిఖీల్లో ఎక్కడైనా ఈ పరిస్థితులు కనిపిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు.

చీడపీడలు నివారించుకోండి

బల్లికురవ: పొగాకు, మినుము, పైర్లకు రసం పీల్చే పురుగులు ఆశించాయని తక్షణమే నివారించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి కోరారు. మంగళవారం కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాల్లో పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్రీకరణ, పంట నష్టం పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు రైతులు 14 అంకెలతో కూడిన గుర్తింపు కార్డు పొందాలన్నారు. గుర్తింపు కార్డు కోసం ఈ నెల 25వ తేదీ లోపు పుస్తకం ఆధార్ కార్డు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మండలంలోని పదివేల పైచిలుకు రైతులు ఉండగా 4,643 మంది రైతులు మాత్రమే రిజిస్టర్ చేసుకున్నారని కుమారి వివరించారు.

మార్చిలో అపరాల కొనుగోలు

మేదరమెట్ల: రానున్న మార్చి నెలలో కంది, శనగ వంటి అపరాలను రైతు మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ తెలిపారు. కొరిశపాడు మండలంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రావినూతల, ప్రాసంగులపాడు గ్రామాల్లో మంగళవారం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడీఏ మాట్లాడుతూ రైతులకు ఆధార్ కార్డుకు బదులుగా పదకొండు అంకెల ప్రత్యేక నంబరును రిజిస్టరు చేసుకోవాలన్నారు. ఈ నంబరు ప్రభుత్వం అందచేసే సబ్సిడీలు, పంట నష్టపరిహారాలు, భూమి నష్టపరిహారం వంటి పథకాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి రిజిస్టరు నంబరును పొందాలని ఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి శిక్షణ

యద్దనపూడి: విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అవసరమైన శిక్షణ తీసుకోవాలని యద్దనపూడి ఎంఈఓ పి. సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి అంగన్‌వాడీ టీచర్లకు 6 రోజుల శిక్షణ కార్యక్రమం యద్దనపూడి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దేవేందర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. హెచ్ఎం మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తామని తెలిపారు. కోర్సు డైరెక్టర్ మండల విద్యాశాఖాధికారి పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరావు మాట్లాడుతూ అంగన్ వాడీ వర్కర్లు అంతా శిక్షణలో పాల్గొనాలని, విద్యార్థి సమగ్రాభివృద్ధికి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సీడీపీఓ సుభద్ర మాట్లాడుతూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. రిసోర్స్ పర్సన్‌గా వంశీకృష్ణ, శ్రీనివాసరావు, వెంకటరామయ్య, దీపాదేవి వ్యవహరించారు.

విద్యా వ్యవస్థకు పునాది అంగన్‌వాడీ

కారంచేడు: ప్రతి చిన్నారికీ ఓనమాలు నేర్పిస్తూ.. విద్యా వ్యవస్థకు బీజంగా ఉండేవి అంగన్‌వాడీ కేంద్రాలేనని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. హెచ్ఎం ఎంవీ సుబ్బారావు, డీఆర్‌పీ ఎస్ నరసింహారెడ్డి, సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంకలమర్రులో..

మండలంలోని కుంకలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని హెచ్ఎం పద్మావతి ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ శిక్షణ సద్వినియోగం చేసుకొని చిన్నారులకు మంచి పౌష్టికాహారంతో పాటు, విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. డీఆర్‌పీలు వి. బాబూరావు, రేణుకాదేవి, సూపర్‌వైజర్ హిమబిందు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ మెళకువలు తెలుసుకోండి

పర్చూరు (చినగంజాం): అంగన్‌వాడీ టీచర్‌లు చిన్నారులకు ప్రీస్కూల్ విద్యను అందించడంలో మెళకువలు తెలుసుకోవాలని ఎంఈఓ 1 ఎంవీ సత్యనారాయణ అన్నారు. 120 రోజుల జ్ఞానజ్యోతి మొదటి విడత, మొదటి రోజు శిక్షణ కార్యక్రమం ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం ప్రారంభించారు. సీడీపీఓ జీ సుభద్ర మాట్లాడుతూ నాణ్యమైన అభ్యసనాలను శిక్షణ ద్వారా నేర్చుకొని అందించాలని తెలిపారు. పర్చూరు ఎంఈఓ–1 ఎంవీ సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలన్నారు. భవనం చింపారెడ్డి, అంగన్‌వాడీ సూపర్ వైజర్‌లు ఎం. అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్ఞాన జ్యోతి మానసిక స్థితిని అంచనా

మార్టూరు: జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా ప్రాథమిక దశలోని విద్యార్థుల మానసిక స్థాయిలను అంచనా వేసి వారిలో అభివృద్ధి, సంఖ్యా జ్ఞానాన్ని మెరుగు పరచవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కె. పద్మ అన్నారు. కోలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడారు. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయ సహకారాలతో అంగనవాడీ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఉద్దేశించి ఈ కార్యక్రమం ప్రారంభించామన్నారు. మండల స్థాయిలో ఎంఈఓ డైరెక్టర్ గా, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ రీసెర్చ్ పర్సన్ గా వ్యవహరిస్తారని తెలిపారు. ఆరు రోజులు పాటు నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతుల్లో విద్యార్థుల మానసిక స్థాయిలపై అంచనాలు రూపొందించటం మెరుగైన ఫలితాలు సాధించడంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రిసోర్స్ పర్సన్లు బండారు రాంబాబు, కె. మునలయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

జె. పంగులూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. సుభాష్ (19) అనే యువకుడు చందలూరులోని తన పెద్దమ్మ వాళ్ళ ఇంటి వద్దకు వచ్చి తిరిగి రాత్రి 11 గంటల సమయంలో స్వగ్రామం రావినూతల బయలుదేరాడు. బైక్ అతివేగంగా నడుపుతూ అదుపుతప్పి చెందలూరు నుంచి కొప్పెరపాడు సమీపంలో రోడ్డు పక్కన ఉన్న స్తంభానికి ఢీకొన్నాడు. తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ వినోద్ బాబు మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.